

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం

28 డిసెంబర్ 2025 పేజీలు : 08


ప్రతి ఇంటిపై సోలార్

## యూనిట్ బిగించుకోండి

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



నెల్లూరు, మేజర్‌న్యూస్ :

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన అద్భుత పథకం కాలుష్యం తగ్గడంతో పాటు ప్రజలపైన భారం కూడా తగ్గుతుంది.. సోలార్ విద్యుత్ యూనిట్లపై వెంకటాచలంలో ఆంధ్రా ఎంట్రప్రైజెస్ కంపెనీ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్ణీత మొత్తంలో 10 శాతం చెల్లించి ఇళ్లపై సోలార్ యూనిట్ బిగించుకునే అవకాశం ఉందన్నారు. 2కేవీకి రూ.60 వేలు, 3 నుంచి 10 కేవీ వరకు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తోందని, 3 కేవీ యూనిట్ ధర రూ.2.20 లక్షలు అనుకుంటే సబ్సిడీ రూ.78 వేలు లభిస్తుందన్నారు. మిగిలిన రూ.1.42 లక్షలు పెట్టాలన్నారు. అందులోనూ రూ.1.20 లక్షలు బ్యాంకు రుణం అందుతుందన్నారు. కేవలం రూ.20 వేలు పెట్టుబడితో ఇళ్లపై 3కేవీ సోలార్ యూనిట్ బిగించుకోవచ్చన్నారు. ప్రతినెలా 300 నుంచి 375 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

-మిగతా 2లో

తడి.. పొడి చెత్త సేకరణపై..

# అవగాహన కల్పించండి

## కలెక్టర్ హిమాన్షు శుక్ల



నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

ఇంటింటి నుంచి తడి చెత్త, పొడి చెత్త సేకరణలో సచివాలయ సానిటరీ సిబ్బంది ప్రజలలో మరింత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. శనివారం స్థానిక పాత మునిసిపల్ కార్యాలయంలో దోర్నాల వీధి(41/1), మేక్లీన్స్ రోడ్ (42/1), చిన్నబజర్ (48/3), టెంకాయలవీది (52/3) సచివాలయ సిబ్బందితో హౌస్ హెూల్డ్ సర్వే, సిబ్బంది విధులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సచివాలయంలో అన్ని రిజిస్టర్లు విధిగా ఎప్పటికప్పుడు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయ నియమ నిబంధనల ప్రకారం నిర్వహించి పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది నిర్వహిస్తున్న పలు రిజిస్ట ర్లును పరిశీలించారు. సమాచార హక్కు చట్టం- 2005 అమలుపై రిజిస్టర్‌ను నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఇంటింటి సర్వే ఎలా చేస్తున్నారని సంబంధిత సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్లానింగ్ సెక్రెటరి, ఎమినిటీస్ సెక్రటరీలు, సానిటేషన్ సెక్రటరీలు, ఎడ్యుకేషన్ సెక్రటరీలు, వెల్ఫేర్ సెక్రటరీలతో విడివిడిగా చర్చించి విషయాలు తెలుసుకున్నారు. ఎమినిటీస్ సిబ్బందితో మాట్లా డుతూ.. రోజూ మున్సిపల్ వాటర్ ఎన్నిసార్లు, ఎక్కడినుండి అందిస్తున్నారు, ట్యాంకుల ద్వారా ఎక్కడైనా సరఫరా చేస్తున్నారా వివవరాలు సేకరించారు. తల్లికి వందన అర్హులైన అందరికి అందిందా, సమస్యలు ఏమైనా ఉన్నాయా.. అని ఎడ్యుకేషన్ సెక్రటరీలను అడిగి తెలుసుకున్నారు. ప్లానింగ్ సిబ్బంది రిజిస్ట్రేషన్



-మిగతా 2లో

# టీడీపీలోకి జోరుగా చేరికలు



నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చెరుకూరి మనోజ్ చౌదరి, వారి మిత్ర బృందం చేరింది. వారికి పార్టీ కండువా కప్పి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. పది మందికి మేలు చేసేవిధంగా, ప్రజలకు ఉపయోగ పడేవిధంగా పని చేయాలని, అందుకు స్థానిక శానస భ్యుడిగా తన సహకారం ఎప్పుడూ ఉంటుందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కూటమిని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తామన్నారు. రాష్ట్రం మొత్తం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. అందరం కలసికట్టుగా ఒక్కతాటిపై

-మిగతా 2లో



అధిక శబ్దం చేసే సైలెన్సర్లు అమర్చి

## వాహనాలు నడిపితే..

# కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ డా॥ అజిత వేజెండ్ల

నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :

జిల్లావ్యాప్తంగా సౌండ్ పొల్యూషన్ చేసే మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అజితా వెజెండ్ల హెచ్చరించారు. శనివారం కె.వి.ఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో ఎస్పీ ఆధ్వర్యంలో సుమారు 200 మోడీఫైడ్ సైలెన్సర్లును ప్రజల ముందే రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగిస్తున్నట్లు ఆమె తెలియజేశారు. అదేవిధంగా సౌండ్ పొల్యూషన్ చేసే సైలెన్సర్లతో ప్రయాణించే

-మిగతా 2లో

# గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టండి - డీపీఓ వసుమతి

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పంచాయతీ కార్య దర్శులు గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వసుమతి సూచించారు. పొదలకూరు మండల పరిషత్ కార్యాలయంలో నెల్లూరు, ఆత్మకూరు డివిజన్‌ల పరిధిలోని పొదలకూరు, కలువాయి, చేజర్ల మండలాలకు సంబంధించి సచివాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యంతో పాటు ఇంటి పనులు ఇతర పనులను ఎప్పటికప్పుడు సేకరించాలని పేర్కొన్నారు. స్వామిత్వ, ఐవిఆర్ఎస్ కాల్స్‌పై ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు డివిజన్ డిడిఓ రమణయ్య,




డిప్యూటీ ఎంపీడీవోలు శేషగిరిరావు, అమర్, జీవీ రమేష్, సచివాలయ ఉద్యోగులు, పొదలకూరు మండల పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

# అధిక శబ్దం చేసే సైలెన్సర్లు అమర్చి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబమని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనాల్లో అధిక శబ్దం చేసే సైలెన్సర్లు ఉంటే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మోడిఫైడ్ సైలెన్సర్లు తక్షణమే ఊడదీయుంచి కంపెనీ ద్వారా అమర్చబడిన ఒరిజినల్ సైలెన్సర్లు మాత్రమే బిగించేలా చర్యలు తీసుకున్నారు. ఇలాంటి మోడిఫైడ్ సైలెన్సర్లు విక్రయించే షాపుల యజమానులు, అమర్చే మెకానికులపై కూడా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ తరహా స్పెషల్ డ్రైవులు ఇకపై కూడా నిరంతరంగా కొనసాగుతాయని ప్రకటించారు. అంతేకాకుండా ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదని, హెల్మెట్






తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. అదేవిధంగా ప్రజలు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించి శాంతియుతమైన, సురక్షితమైన ప్రయాణాలకు తోడ్పడాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య, టౌన్ ఇన్చార్జి డిఎస్పి గిరిధర్‌రావు, ఎస్‌బి డిఎస్‌పి శ్రీనివాసరావు, నార్త్, సౌత్ ట్రాఫిక్ సిఐలు పాల్గొన్నారు.

## తడి పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించండి

(మొదటి పేజీ తరువాయి)

శాఖతో సమనవ్య పరచుకొని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమ అనంతరం మేక్లీన్స్ రోడ్‌లో జయమ్మ ఇంటి వద్ద ఇంటింటి సర్వే ప్రక్రియను క్షేత్ర స్థాయిలో సబందిత సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో నగరపాలక సంస్థ కమీషనర్ నందన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి శ్రీధర్‌రెడ్డి, ముఖ్య ప్రణాళిక అధికారి నరసింహు లు, గ్రామా వార్డు సచివాలయ అడిషనల్ కమీషనర్ హిమ బిందు తదితరులు పాల్గొన్నారు.

# ముక్కోటి ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

### 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్ రెడ్డి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** బాలాజీ నగర్ సీతారాంస్వామి మందిరంలో వికాస్ ప్రజాహిత సేవా సమితి సభ్యులు, శ్రీ సీతారామ స్వామి వారి మంత్రి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్ ప్రజాహిత సేవాసమితి అధ్యక్షులు, 14 డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 30వ తేదీ మంగళవారం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్ శ్రీ సీతారామస్వామి వారి మందిరంలో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దాదాపు భక్తులు 5 వేల నుంచి 10 వేలు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. గత సంవత్సరం కూడా 4 వేల మంది పైగా భక్తులు దర్శనం చేసుకున్నారన్నారు. పుణ్యప్రదమైన 30న తెల్లవారు జామున 4 గంటల నుంచే ఆ వైకుంఠవాసుని దర్శన భాగ్యం కలగనుందన్నారు. దీనికోసం ఆలయ నిర్వాహకులుతో కలసి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏడు ద్వారాలను ఏర్పాటు చేసి వాటి గుండా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శనం చేసుకునేలా చేస్తున్నామన్నారు. అన్నమయ్య వంశీకులు గతంలో మందిరానికి అందజేసిన శ్రీదేవి భూదేవి సమేతంగా శేషవాహనంపై శ్రీనివాసుడు, గరుడవాహనంపై శ్రీ రామచంద్ర ప్రభు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని కర్తం ప్రతాప్ రెడ్డి తెలియజేశారు. శ్రీ సీతారామ స్వామి మందిర్ కమిటీ గౌరవ అధ్యక్షులు తాతా కిషోర్ మాట్లాడుతూ.. భక్తులందరూ ముక్కోటినాడు ఆలయానికి వచ్చి ఉత్తర ద్వారం గుండా వైకుంఠవాసుని దర్శనం చేసుకోవాలని కోరారు. కర్తం ప్రతాప్ రెడ్డి గత సంవత్సరం నుంచి తూర్పు ప్రాంతంలో భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తున్నారన్నారు. శ్రీ త్యాగరాజ కళ్యాణ మండపం అధ్యక్షులు అమర మోహన్ రావు మాట్లాడుతూ.. భక్తులందరూ ముక్కోటి ఏకాదశి రోజున 4 గంటలకు దర్శనం చేసుకోవాలని, వారందరికీ ప్రసాదం అందజేస్తామన్నారు. ఆలయ అర్చకులు బృందావనం శ్రీనివాస్చార్యులు మాట్లాడారు. సమావేశంలో ఆలయ గౌరవ అధ్యక్షులు తాతా కిషోర్, అమరా మోహన్ రావు, అధ్యక్షులు తన్నీరు మస్తాన్రావు, సెక్రెటరీ రత్నం, ట్రెజరర్ ప్రసాద్, వికాస్ ప్రజాహిత సేవా సంస్థ సభ్యులు, రామాంజనేయ రెడ్డి, మీరాబాషా శ్రీనివాస్ రెడ్డి, దినేష్ రెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్ రెడ్డి, మూర్తి, రేణుక శీను పాల్గొన్నారు.

# టీడీపీలోకి జోరుగా చేరికలు



(మొదటి పేజీ తరువాయి)

ఉండి, ప్రజలకు అందుబాటులో ఉందామన్నారు. నన్ను నమ్మి తెలుగుదేశం పార్టీలో చేరుతున్న ప్రతిఒక్కరికి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో నగర మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, క్లస్టర్ ఇంచార్జ్ నూకరాజు మదన్ కుమార్ రెడ్డి, కో క్లస్టర్ ఇంఛార్జ్ ఖాదర్ బాషా, కార్పొరేటర్ చేజర్ల మహేష్, 20వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు దారా మల్లి, 21వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు చాన్ బాషా, టీడీపీ నాయకులు అన్నంగి రమణయ్య, పిచ్చి రెడ్డి, దిలీప్ రెడ్డి, పోతురాజు రవి, మాసా శ్రీనివాసులు, భాస్కర్ రెడ్డి, చంటి తదితరులు పాల్గొన్నారు.

## రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులకు మాజీ మేయర్ శంకుస్థాపన

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నగరంలోని నెల్లూరు హాస్పిటల్స్ సమీపంలో 10 లక్షల రూపాయల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 38వ డివిజన్ పరిధిలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నెల్లూరు హాస్పిటల్ ప్రాంతంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం ఇక్కడ స్థానికులు ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగానే ఆయన వెంటనే స్పందించి రూ.10 లక్షల రూపాయలను విడుదల చేయించారన్నారు. అలాగే ఇక్కడ పార్క్ నిర్మాణానికి కూడా తనవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కో క్లస్టర్ ఇంచార్జి విష్ణుప్రియ, రియాజ్, తోట రాజేశ్వరి, మాదర్, బషీర్, కరిముల్లా, దుర్గ, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## వారం రోజుల్లో సుంగు చెంగన్న పాఠశాల సమస్యకు పరిష్కారం చూపుతాం

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** లక్షలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన సుంగు చెంగన్న పాఠశాల ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సహాయ సహకారాలతో కమిషనర్, నగర మేయర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకుని వెళ్లి పాఠశాల పునర్నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ పేర్కొన్నారు. నెల్లూరు మద్రాసు బస్టాండ్ వద్దనున్న సుంగు చెంగన్న పాఠశాలను శనివారం ఆమె సందర్శించి మొక్కలను నాకారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పిన సుంగు చెంగన్న పాఠశాల ప్రస్తుతం పెచ్చులూడిపోతు పడిపోతుందని, దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లామని, త్వరలోనే నూతన భవన నిర్మాణానికి తమ ప్రయత్నం సాగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కే.అరవింద్, టిడిపి కోక్లస్టర్ ఇంచార్జ్ విష్ణుప్రియ, రియాజ్, తోట రాజేశ్వరి పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై సోలార్ యూనిట్ బిగించుకోండి

(మొదటి పేజీ తరువాయి)




అవుతుందన్నారు. ఐదేళ్ల తర్వాత బ్యాంకు లోను తీరిపోవడంతోపాటు ఇంటికి ఉచితంగానే విద్యుత్ లభిస్తుందన్నారు. 25 ఏళ్ల వరకు యూనిట్ పనిచేస్తుందని, సోలార్ విద్యుత్ వినియోగం పెరిగితే బొగ్గుతో ఉత్పత్తి తగ్గి కాలుష్య సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఆంధ్రా ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ సర్వేపల్లి నియోజకవర్గంలో కార్యాలయం ఏర్పాటు చేసేందుకు కూడా ముందుకొచ్చిందని, కంపెనీ ప్రతినిధులు ఇక్కడే ఉండి సర్వీసింగ్ కూడా అందిస్తామని చెబుతున్నారని తెలిపారు. ప్రజలు ఆలోచించి సోలార్ యూనిట్లు బిగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు

● విద్యార్థులకు విద్య ద్వారానే ఉన్నత పదవులు లభిస్తాయి ● ఉన్నత పాఠశాల చైర్మన్ మారుబోయిన సుందరయ్య

**జలదంకి, మేజర్‌న్యూస్ :** విద్యార్థులకు, విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని ప్రణాళిక, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని జలదంకి ఉన్నత పాఠశాల చైర్మన్ సుందరయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో సేవా గుణం కలిగిన ఆదర్శ దంపతులు డాక్టర్ నరేంద్రబాబు, మాలినీ దేవి దంపతుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ దంపతులు జలదంకి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే పలు సేవా కార్యక్రమాలకు నిధులు విచ్చిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సుందరయ్య మాట్లాడుతూ.. నరేంద్రబాబు, మాలినీ దేవి దంపతులు విద్యార్థుల ప్రయోజన అభివృద్ధికి ఎంతోగానో తోడ్పడుతున్నట్లు తెలిపారు. జలదంకి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధ్యంచేందుకు 100 రోజుల ప్రణాళికకు మాలినీ దేవి దంపతులు తమ సొంత నిధులు వెచ్చించి సహాయపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాలిని దేవి మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి, వారి శ్రేయభివృద్ధికి నిరంతరం తాను కృషి చేస్తానని తన దృష్టికి వచ్చిన ప్రతి విద్యార్థికి సాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు కె.హరినారాయణ రెడ్డి మాట్లాడుతూ.. జలదంకి ఉన్నత పాఠశాల అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కావలిలో రెడ్‌క్రాస్ తరఫున ఎన్నో మంచి




కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి గడ్డవారిపాలెం చెందిన పూర్వ విద్యార్థి కోటా అంజిరెడ్డి తనవంతు సహాయంగా లక్ష రూపాయలు విరాళం పాఠశాలకు అందించినట్లు హరి నారపరెడ్డి తెలిపారు. జలదంకి ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న మాలిని దేవి కుటుంబ సభ్యులకు పూర్వ విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు జలదంకి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు హరి నారపరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ వింజావలి, నరసింహారావు, రాయి మాల్యాద్రి, రాజా, ఉపాధ్యాయులు, విద్యార్థుల, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టెలికాం వినియోగదారులకు అవగాహన సదస్సు




**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని టెలికాం వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడమే టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రాయ్ యొక్క ముఖ్య ఉద్దేశమని సిఏజి మెంబర్ బి.శారద తెలియజేశారు. మర్రిపాడు గ్రామంలో శనివారం నాడు టెలికాం వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టెలికాం సేవలో వినియోగదారుల ప్రయోజనాలను సంరక్షించడం కోసం టెలికాం నియంత్రణ ప్రాధికార సంస్థ కేంద్ర ప్రభుత్వం 1997లో టిఆర్ఏఐ ఏర్పాటు చేయడం జరిగినదని, వివిధ టెలికాం సేవల నాణ్యత ప్రమాణాలతో రూపొందించి వీటిని సమర్థవంతంగా అమలు చేయడానికి వినియోగదారుల ప్రయోజనాలను హక్కులను కాపాడటానికి ట్రాయ్ కృషి చేస్తుందని తెలియజేశారు. అలాగే మై స్పీడ్ కాల్ యాప్ రూపొందించారని దీని ద్వారా నెట్వర్క్ ఎంత స్పీడ్‌గా ఉందో మనం తెలుసుకోవచ్చని తెలియజేశారు. అలాగే అనుచిత కాల్స్ వస్తే వినియోగదారులకు అంతరాయం ఏర్పడుతుంటే స్టార్ 1909 కాల్ చేసి అనుచిత కాల్స్ ను ఆప వచ్చునని తెలియజేశారు. ముఖ్యంగా ఏటీఎంల దగ్గర డబ్బులు డ్రా చేసేటప్పుడు పక్క వారికి పిన్ నెంబర్ తెలియజేయకూడదని అలాగే అమౌంట్ తీసుకున్న తర్వాత కచ్చితంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. బిఎస్ఎన్ఎల్ జేటిఓ సురేష్ మాట్లాడుతూ.. బిఎస్ఎన్ఎల్ యొక్క సేవలను గురించి వినియోగదారులకు తెలియజేశారు అలాగే నెట్వర్క్ ఇష్యూస్ గురించి కూడా వినియోగదారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తెలియజేశారు సైబర్ క్రైమ్ నేరాల గురించి అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి పరిస్థితులలోనూ ఏపీకే పిల్ వాట్సాప్ లలో వస్తే దాన్ని ఓపెన్ చేయకూడదని తెలియజేశారు. ఈ సందర్భంగా వినియోగదారుల కోసం రూపొందించిన మెటీరియల్‌ను అందరికీ అందజేశారు. ఈ సదస్సుకు వంద మందికి పైగా మహిళలు, స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గౌస్నిసా బేగం గ్రామ సమైక్య మహిళలు వెలుగు ఏపిఎం బుజ్జమ్మ. సిడిపిఓ పద్మావతమ్మ, అంగన్వాడీ టీచర్లు, బిఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

# వేలాదిమంది ప్రజలదాహార్తిని తీరుస్తున్న కంచి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో, నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై నెల్లూరుపాళెం కూడలి వద్ద స్థానిక నిత్యాన్నదాత, అనేక సామాజికసేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీ సాంబశివచారిటబుల్‌ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి దాహార్తితో అల్లాడుతున్న ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. అనేక సామాజికసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న, స్తానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో రోజుకు దాదాపు700మందికి అన్నదానం అందిస్తూ నిత్యాన్నదాన కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగిస్తున్న పరమేశ్వరరెడ్డి ప్రజల దాహార్తిని, ఇబ్బందిని గమనించి అత్యంత భారీ సేవా కార్యక్రమంగా త్రాగునీటి సరఫరాకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆత్మకూరుపట్టణంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ బస్టాండువద్ద తాగునీటి సౌకర్యం కల్పించలేదు. దాంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణీకులు దాహార్తితో అల్లాడుతుండేవారు. నెల్లూరుపాళెం కూడలివద్ద నిత్యం నలుమూలలనుండి రాకపోకలు సాగించే ప్రయాణీకులు కూడా తాగునీటి సమస్యతో సతమతమవుతుండేవారు. ఈపరిస్థితిని నేరుగా గమనించిన కంచి పరమేశ్వరరెడ్డి మున్సిపల్‌బస్టాండు, నెల్లూరుపాళెం కూడలిలో త్రాగునీటి సరఫరాకేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు బస్టాండువద్ద మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. మున్సిపల్ బస్టాండువద్ద రోజుకు 2వేలమంది త్రాగునీటిని, 500మంది సగటున మజ్జిగను పొందుతూ తమ దాహార్తిని




తీర్చుకుంటున్నారు. నెల్లూరుపాళెం వద్ద రోజుకు 1500మంది తాగునీటిని పొందుతున్నారు. జిల్లా ప్రభుత్వవైద్యశాల వద్ద ఇటీవల కంచి చలివేంద్రను ఏర్పాటుచేసి తాత్కాలిక షెల్టరును, బెంచీలను కూడా ఏర్పాటు చేయడంతో ప్రజలకు, రోగులకు, వారి బంధువులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంది.బాగా ఇబ్బందికరంగా ఉన్న మూడు ప్రధానకేంద్రాల్లో బృహత్తర తాగునీటి సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభించి దాహార్తిని తీర్చుతున్న కంచి పరమేశ్వరరెడ్డి సేవానిరతిని సర్వత్రా కొనియాడుతున్నారు. అనేక ప్రజాసంఘాలవారు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# కావలి సబ్ జైల్లో న్యాయవిజ్ఞాన సదస్సు

▶ ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి మండల న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో సబ్ జైల్లో న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జ్ ఏ.గీత వాణి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి మనిషి తప్పు చేస్తారని తెలిసో, తెలియక చేసిన తప్పులు వలన ఈరోజు ఈ స్థితి మీకు కలిగిందని ఇక్కడికి వచ్చిన తర్వాత పరివర్తన చెంది మంచి ప్రవర్తనతో జన జీవన స్రవంతిలో కలిసి పోయి గౌరవంగా జీవించాలని చెడు వ్యసనాలకు అలవాట్లకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి వారి జీవితాన్ని కుటుంబాన్ని సవ్యంగా సుఖంగా సంతోషంగా జీవించాలని వారు ఖైదీలకు తెలిపారు. అలాగే బయటికి వచ్చిన తర్వాత ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే లాయర్‌ను పెట్టుకొని స్తోమత లేకపోతే వారికి న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా లాయర్‌ను ఏర్పాటు చేస్తామని సీనియర్ సివిల్ జడ్జి తెలిపారు. అనంతరావు అక్కడ ఖైదీలకి అందిస్తున్న ఆహార పదార్థాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడెడ్ మెంబర్ ఐ.సాయిప్రసాద్, పిఎల్‌వీ సిహెచ్ అశోక్, మాలకొండారెడ్డి, జైల్ సూపర్డెంట్ చిన్న సుబ్బయ్య, జైలు సిబ్బంది ఖైదీలు పాల్గొన్నారు.

## అద్దె బకాయిలు చెల్లించని షాపులను సీజ్ చేసిన ఆర్ఐ




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోని ప్రకాశం పంతులు మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్, పప్పుల వీధి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లలో కొన్ని దుకాణాలు అద్దె బకాయిలు చెల్లించకుండా ఉన్నందున, సంబంధిత షాపు నిర్వాహకులకు పలుమార్లు నోటీసులు జారీచేసినా, ఎంతకీ సంబంధిత షాపు నిర్వాహకులు స్పందించకపోవడంతో, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఆదేశాల మేరకు షాపులను శనివారం సీజ్ చేశారు.రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ సీవీఎస్ కిరణ్ ఆధ్వర్యంలో వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పి.శేఖర్, షేక్ సమీరాలతో కలిసి సీజింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్టోబర్, 2024 నుండి బకాయి ఉన్న షాప్ నెం.13, రూ.1,20,000/-లు, పప్పుల వీధి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందు ఆగస్ట్, 2024 నుండి షాప్ నెం.2, రూ.1,08,435/-లు, షాప్ నెం.3, రూ. 1,08,435/-లు, షాప్ నెం.14, రూ.80,476/-లు, షాప్ నెం.15, రూ. 1,04,076/- లు, షాప్ నెం. 18, రూ. 48,321/-లు బకాయి ఉన్నందున ఆ షాపులను సీజ్ చేశామని ఆర్ఐ తెలిపారు.

## జనవరి పది నుంచినుంచి క్రికెట్ టోర్నమెంట్

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండలంలోని అనంతసాగరం గ్రామంలో జనవరి 10నుంచి సంక్రాంతి సందర్భంగా జాలి బాయ్స్ ఆధ్వరంలో క్రికెట్ టోర్నమెంట్ రెండు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించబడుతుంది ఆర్గనైజర్స్ బుధవారం తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గం క్రీడాకారులు క్రికెట్ టోర్నమెంట్ పాల్గొనాలని తెలిపారు. తెలిపారు. ప్రథమ బహుమతి 25వేలు, ద్వితీయ బహుమతి 15వేలు నగదు బహుమతి అందజేయడం జరుగుతుందని తెలిపారు. 9951215937, 9447337500, 9963636983, ఆసక్తి ఉన్నవారు. ఈ నెంబర్లకు ఫోన్ చేసి టీం పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.


# వీర బాలుల త్యాగం తరతరాలకు స్ఫూర్తి : వడ్డే శ్రీనాథ్ రెడ్డి

**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీర బాల్ దివస్ కార్యక్రమం జలదంకి భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ముడి కిషోర్ రెడ్డి ఆధ్వక్షతన అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి హాజరైన భారతీయ జనతా పార్టీ నెల్లూరు జిల్లా కార్యదర్శి వడ్డే శ్రీనాథ్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి చేసిన ప్రసంగం అందరినీ భావోద్వేగానికి గురిచేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన రోజు డిసెంబర్ 26 అని. ఇది ధైర్యానికి, త్యాగానికి, దేశభక్తికి ప్రతీక అయిన వీర బాల దివస్ అని అన్నారు. సిక్కు మత పదవ గురువైన శ్రీ గురు గోబింద్ సింగ్‌కుమారులు సాహిబ్జాదా జోరావర్ సింగ్, సాహిబ్జాదా ఫతే సింగ్ గురించి ప్రస్తావిస్తూ, వారు వయసులో చిన్నవాళ్లే అయినా వారి ధైర్యం పర్వతాలంత గొప్పది. ధర్మం కోసం, సత్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన వీరులు వారు. మతం మార్చుమని బెదిరింపులు వచ్చినా, ప్రలోభాలు చూపినా, వారు ఒక్క అడుగు కూడా వెనక్కి వేయలేదు. 'మా ధర్మమే మా ప్రాణం' అని నిలబడ్డారు' అని తెలిపారు. ఆ కాలంలో చిన్నారులైన వారిని జైలులో నిర్బంధించి, చలిలో, ఆకలిలో ఉంచి, చివరకు గోడల్లో బతికేలా కట్టివేసిన ఘోర సంఘటనను గుర్తు చేస్తూ, 'ఆ ఘడియల్లో కూడా వారి ముఖాల్లో భయం లేదుడ కన్నీరు లేదు. ఉన్నది ఒక్కటే ధర్మంపై అపారమైన విశ్వాసం' అని భావోద్వేగంగా వివరించారు. ఇప్పటి తరానికి సందేశమిస్తూ, 'ఈ రోజుల్లో చిన్న సమస్యకే మనం కుంగిపోతున్నాం. కానీ ఆ రోజుల్లో ఆ చిన్నారులు మరణాన్నే ఎదుర్కొని గెలిచారు. వారిని చూసి మనం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. విద్యార్థులు చదువులో ముందుండాలి, తల్లిదండ్రులను గౌరవించాలి, దేశాన్ని ప్రేమించాలి. అప్పుడే మన



జీవితానికి నిజమైన అర్థం ఉంటుంది' అని అన్నారు. వీర బాలుల త్యాగం దేశానికి వెలుగు చూపే దీపమని, వారి స్ఫూర్తి ప్రతి భారతీయునిలో నిలవాలని కోరారు. 'వీరుల త్యాగాన్ని మాటల్లో కాదు మన జీవన విధానంలో చూపించాలి' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోపాఠశాల ప్రధానోపాధ్యాయులు వింజావళి, స్కూల్ చైర్మన్ మర్రిబోయిన సుందరయ్య యాదవ్, రాష్ట్ర వినియోగదారుల హక్కుల సంఘ నాయకులు చిదర్ల మల్లికార్జున, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వంటేరు రాకేష్, పాఠశాల ఉపాధ్యాయులు మాల్యాద్రి, తిరుపతి, శ్రీనివాసులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. చివరగా, దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర బాలులకు ఘన నివాళులు అర్పిస్తూ, విద్యార్థులందరూ 'భారత్ మాతా కీ జై', 'వీర బాల్ దివస్ అమరహో' అనే నినాదాలతో కార్యక్రమాన్ని ముగించారు.

# ఇంటింటికి ఎమ్మెల్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉందని తెలుసుకోవడానికి ఎమ్మెల్యేలు ప్రజల వద్దకు వెళ్లాలని ఇంటింటికి ప్రజాప్రతినిధుల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. వారి ఆదేశాల మేరకు శనివారం కావలి పట్టణంలో 40 వార్డులు ఇంటింటికి కార్యక్రమంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేకి వార్డు ప్రజలు నాయకులు మహిళలు యువత ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా కావలి నియోజకవర్గం ప్రజలు సంతోషంగా ఉండాలని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అధికారులు వార్డు నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు అవసరాలు ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజలు చెత్త, నిర్వహణ కాలువలు రోడ్లు, వీధి దీపాలు, త్రాగునీరు ప్రతి అంశం గురించి ప్రజల ను అడిగి తెలుసుకున్నారు ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందు కు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల వద్దకే ప్రభుత్వం ప్రజల సమస్యలే ముఖ్యమని ఎమ్మెల్యే కావ్య తెలిపారు. 40 వార్డులో అభివృద్ధి ప్రజల్లో కొత్త ఆశలను చిగురించింది. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మైనారిటీలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్వత్రా ఉత్కంఠ

● ప్రభుత్వ నిర్ణయంపై ఆసక్తి ● ఉంచితే సంబరం విడదీస్తే.?
● రాపూరు ప్రజల్లో తీవ్ర చర్చ ● కొనసాగుతున్న జేపీసీ నిరాహారదీక్షలు

**రాపూరు, మేజర్‌న్యూస్ :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అంతర్భాగమైన రాపూరు మండలాన్ని విడదీసి నూతనంగా తిరుపతి జిల్లా లో కలిపేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల పై గత నెలరోజులుగా రాపూరు మండల ప్రజలు ఐక్యంగా జేఏసీ ఆధ్వర్యంలో తన అభ్యంతర, నిర సనగళాన్ని వినిపిస్తున్నారు. ఈ నేపద్యంలో ప్రభు త్వం అభ్యంతరాలకు ఇచ్చిన గడువు గురువారం తో ముగిసింది. దీంతో ప్రజల్లో సర్వత్ర ఆసక్తి నెలకొంది. ప్రభుత్వం తమ ఆందోళనలను, నిరా హార దీక్షలను, అభిమ తాలను, అభిప్రాయాలను, పరిగణలోకి తీసుకుం టుందా.? లేక రాజకీయం గా రాపూరు మండలంను తిరుపతిలో కలుపు తుందా.? అనే ఆందో ళనలో ప్రజల్లో తీవ్రచర్చ కొనసాగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఏ విధమైన నిర్ణయం ప్రకటిస్తుందో అని సర్వత్రా మండలం వ్యాప్తంగా ఉత్కంఠత నెలకొని ఉంది. ఈ నేప థ్యంలో శనివారం సాయంత్రం సోషల్ మీడియా




లో ట్రోల్ అయిన సమాచారంపై ప్రజల్లో కొంత మేరకు ఆందోళన మరికొంత మేరకు ఆనందం కనిపించింది. రాపూరు మండలంతోపాటు సైదా పురం, కలువాయి మండలాలు కూడా నెల్లూరు జిల్లాలోని కొనసాగుతాయని ఈమేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందంటూ సోషల్ మీడియాలో న్యూస్ హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో వచ్చిన సమా చారం అంత మేరకు స్థానిక ప్రజల్లో ఆందోళనకు దారితీసింది. అయి తే ప్రభుత్వ నిర్ణయానికి ఇంకా సమయం ఉందని తెలుసుకున్న మండల ప్రజలు తమ నిరా హార దీక్షలను కొనసాగించారు. శనివారం సాయం త్రం జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగిన నిరాహార దీక్షలో పెంచలకోన దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ త్రిపాల్‌రెడ్డి, తుమాయి సర్పంచి చంద్రమోహన్, మధుసూదన్‌రెడ్డి, డా.కందుకూరు మస్తాన్ బాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు గోవిందు రంగయ్య, ఖాన్ బాషా, సమయం ప్రసాద్, తాటి శ్రీనివాసులు, సికిందర్, అప్రోచ్, అహ్మద్, యువకులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజాసం ఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## న్యాయవాదిగా పీడీఎస్‌యు భాస్కర్




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో యోహార్ భర్తీ కళాశాలలో విద్యనభ్యసించి విద్యార్థి దశలోనే తను ఉద్యమం చేపట్టి ఎక్కడ సమస్యలు వచ్చిన అన్యాయానికి ఎదురొడ్డి, ఎన్నో పోరాట పటిమలు, ఎన్నో రాస్తారోకోలు నిర్వహించి, పిడిఎస్యు పార్టీలో చురుగ్గా పాల్గొని ఆ పార్టీని బలోపేతం చేసేందుకు విద్యార్థులతో మమేకమై పార్టీ పరంగా తగు సూచనలు, సలహాలిస్తూ పిడిఎస్యు భాస్కర్‌గా కావలి పట్టణ అన్ని వర్గాల వారికి సుపరిచితులు. ఇప్పుడు న్యాయవాదిగా భాస్కర్ హైకోర్టుది బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ నుంచి ప్రయోజనల్ ఆఫ్ ఎన్రోల్మెంట్ యాస్ అడ్వకేట్ గా ప్రమాణం చేసి సర్టిఫికెట్ను అందుకోవడం జరిగింది. అయితే ప్రస్తుతం న్యాయవాదిగా ప్రజలకు ఏ మేరకు న్యాయం చేస్తారనేది ఇప్పుడు మనం వేచి చూడాలి. గతంలో ఒక విద్యార్థి సంఘాలకు నాయకుడుగా ఉండి ప్రజల పట్ల అంకితభావంతో పనిచేశారు. మరి న్యాయవాది వృత్తి పట్ల ప్రజలకి వ్యాపారమా.. లేక న్యాయమా.. వేచి చూడాలి.

## బీజేపీ నాయకుల సంబరాలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్‌గా పాలుగుల్ల విజయలక్ష్మినియమించడం పట్ల బీజేపీ నాయకులు టీడీపీ నాయకులతో కలిసి స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్లో శనివారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బాణసంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. విజయలక్ష్మిని ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు వంశీధరరె డ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నియోజకవర్గంలో బీజేపీకి ప్రాధాన్యతిస్తూ నామినేటెడ్ పదవుల్లో తగిన న్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గడ్డం ప్రసాద్, అంబటి ఈశ్వర్ రెడ్డి,రియాజ్, బొజ్జా శ్రీనివాసులు, నారాయణరెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, హుస్సేనయ్య, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 2 నుంచి భూ సర్వే




**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** జనవరి రెండో తేదీ నుంచి అనంత సాగరం మండలం పడమటి ఖమ్మంపాడులో భూములు రీ సర్వే జరుగు నున్నట్లు రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ నాగలక్ష్మి పేర్కొన్నారు. పడమటి ఖమ్మంపాడులో భూములు రీసెర్వేపై ర్యాలీ జరిగినది. ఈ సందర్భంగా సచివాలయంలో గ్రామసభ జరిగింది. భూముల రి సర్వే పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏంసి డైరెక్టర్ వద్దిబోయిన లక్ష్మీ రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ కత్తి పెంచలయ్య, మండల సర్వేయర్ హారిక, గ్రామ రెవెన్యూ అధికారి ఉదయగిరి ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

## నిందితులకు రిమాండ్

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి సివిల్ సప్లయ్ గోదాములో బియ్యం, సరుకుల స్వాహాకుసంబంధించిన కేసులో నిందితులైన కాంట్రాక్ట్ ఉద్యోగి మునాఫ్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు షాహిద్, రఫీలను శ నివారం ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచ్చగా న్యాయాధికారి ఎల్.జగదీష్‌కుమార్ 14 రోజులపాటు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. దీంతో వారిని ఆత్మకూరు సబ్ జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

# జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తా

## చైర్మన్ మేకపాటి శాంతకుమారి



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్‌గా మేకపాటి శాంతి కుమారిని ప్రకటించిన తర్వాత శనివారం ఆమె మర్రిపాడులోని వారి స్వగృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళలు, యువత భారీ గజమాలలతో ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మేకపాటి నివాసంలో కోలాహలం నెలకొంది. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మేకపాటి శాంతి కుమారి మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్‌గా నాకు అవకాశం కల్పించినటువంటి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, యువ నాయకులు మంత్రి నారా లోకేష్‌కి ముందుండి చేయిపట్టి నన్ను నడిపిస్తున్నటువంటి మావారు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానన్నారు. అదేవిధంగా ఈ పదవి రావడానికి సహకరించినటువంటి రాష్ట్ర అధ్యక్షులకు, జిల్లాలోని ప్రజాప్రతినిధులకు, పార్టీ కోఆర్డినేటర్లకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు, అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఇచ్చిన పదవికి, పార్టీకి క్రమశిక్షణ కలిగినటువంటి కార్యకర్తగా పనిచేస్తానని, అందరి సూచనలు, సలహాలు తీసుకొని గ్రంథాలయం అభివృద్ధి కోసం కృషి చేస్తానని, అదేవిధంగా ముఖ్యంగా ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గల అభివృద్ధి కోసం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మా వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాను అన్నారు. మహిళలకు పార్టీలో కానీ, ప్రభుత్వంలో కానీ సముచిత స్థానం కల్పిస్తూ, ప్రోత్సహిస్తున్నటువంటి ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ, ఏకైక నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అని, మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని మహిళా సంక్షేమం కోసం, మహిళా అభివృద్ధి కోసం ప్రభుత్వం పని చేస్తుందని తెలియజేశారు. అందరి సహకారంతో జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి కోసం పనిచేస్తానని తెలియజేశారు.

# సింహపురి ఇంటర్నేషనల్ పాఠశాలలో ఎడ్యుకేషన్ ఫెయిర్



## అన్ని పాఠ్యాంశాల ఆధారంగా విద్యార్థులచే ప్రాజెక్టుల రూపకల్పన


**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని పేడూరులో సింహపురి ఇంటర్నేషనల్ సీబీఎస్‌ఈ పాఠశాలలో శనివారం విద్యార్థుల ద్వారా అకాడమిక్ ఫెయిర్ నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పీపీ2 నుంచి 9వ తరగతి వరకు స్వయంగా ప్రయోగాత్మకంగా తయారుచేసిన వివిధ ప్రదర్శనలు విద్యార్థుల తల్లిదండ్రులను స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. గత ఐదు సంవత్సరాలుగా ఈ పాఠశాల అంచలంచెలుగా అభివృద్ధి చెందుతూ నేడు 500 మంది విద్యార్థులు విద్యను అభ్యసించుచున్నారు. తక్కువ ఫీజుతో విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుంది. విద్యాబోధన అర్హత కలిగిన ఉపాధ్యాయులచే నిర్వహించడంతో సింహపురి ఇంటర్నేషనల్ పాఠశాలకు మంచి గుర్తింపు రావడంతో పాటు తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించేందుకు ఉత్సాహపడుతున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పి.శివకుమార్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పాత్రికేయులతో తమ పాఠశాల ఎడ్యుకేషన్ ఫెయిర్ గురించి వివరించారు. విద్యార్థులకు ప్రస్తుత పరిస్థితులు భవిష్యత్తులో తీసుకోవలసిన పరిణామాలు శాస్త్రజ్ఞానం పై ఆయా పాఠ్యాంశాల ప్రాజెక్టుల ద్వారా రూపకల్పన చేసినట్లు వివరించారు. రోబో పనిచేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు కూడా జరుపుతామని వారు తెలిపారు. ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ విజయవంతం చేయడంలో కృషిచేసిన ఉపాధ్యాయ సిబ్బందికి విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడి వేడిగా సాగింది. స్థానిక ఎంపీడీఓ ఎంవి మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ, పలుగోటి పెంచలమ్మ జడ్పిటిసి చిత్తలూరు పోలయ్యలు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు. వీటిపై ప్రజా ప్రతినిధులు పంచాయతీలలో సమస్యలను లేవనెత్తి అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీ మాట్లాడుతూ.. అధికారులు అవృవద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి పట్ల తాము కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కాకపోవడాన్ని వారు తప్పు పట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చిత్తలూరు పోలయ్య, ఎంపీపీ, పలు గోటి పెంచలమ్మ, ఎంపీడీవో ఎంవి మోహన్ రెడ్డి,



పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు అమ్మినేని సుబ్రమణ్యం నాయుడు మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.




# నిత్య అన్నదాన పథకంకు లక్ష విరాళం

**రాపూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని అల్లీపురం, మేకలవారితోట ప్రాంతానికి చెందిన, కోమ్మూరు గిరిధర్, మాధవి తదితరులు రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి నిత్య అన్నదాన పథకంకు రూ.లక్ష రుపాయలను నగదును దేవస్థానం కార్యాలయంలో శనివారం అందజేశారని దేవస్థానం ఉపకమీషనర్ కార్యనిర్వహణాధికారి పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారికి ఆలయం మర్యాదలతో దర్శనంతోపాటు శ్రీ స్వామివారి ప్రసాదంలు అందించడం జరిగిందని దేవస్థానం ఉపకమీషనర్ కార్యనిర్వహణాధికారి పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రకటనలో తెలిపారు.

# పలు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ నగర పర్యటనలో భాగంగా శనివారం స్థానిక ఇస్కాన్ సిటీ, మాగుంట లేఔట్ అండర్ బ్రిడ్జి, జనార్దన్ రెడ్డి కాలనీలలో అధికారులతో కలిసి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని రోడ్డు ఆక్రమణ నిర్మాణాలను పరిశీలించి సర్వేయర్ ద్వారా మార్జిన్ మార్కింగ్ చేయించాలని ఆదేశించారు. రోడ్డు ఆక్రమణల నిర్వాసితులకు ప్రత్యామ్నాయంగా టిడ్కో గృహాలు కేటాయించే అవకాశాలను పరిశీలిస్తామని కమిషనర్ వెల్లడించారు. రోడ్డు ఆక్రమణల నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు గతంలో ఏవైనా మంజూరు చేసి ఉన్నారా అన్న విషయంపై వివరాలను తెలుసుకునేందుకు వారి వద్ద నుంచి ఆధార్ కార్డులను సేకరించాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. స్థానిక జనార్దన్‌రెడ్డి కాలనీ ప్రాంతంలో ప్రధాన మార్గానికి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలన్న స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో కలిసి ప్రణాళికలను పరిశీలిస్తామని కమిషనర్ వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం, ఇంజనీరింగ్ విభాగం, రెవెన్యూ విభాగం, పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అన్ని దానాలలో కంటే రక్తదానమే మిన్న


## రక్తదానం మరొకరికి ప్రాణదానం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** అన్ని దానాలలో కంటే రక్తదానమే మిన్నగా ఒకరు రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేసినట్లు అవుతుందనీ వైద్యశాల సివిల్ సర్జన్, బ్లడ్ సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ మధు మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం వింజమూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం నందు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో గొప్ప రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి సుమారు 70 మంది యువత తమ రక్తాన్ని దానం చేశారు. వైద్యశాల వైద్య బృందం కూడా రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క వ్యక్తి ఇచ్చే రక్తం ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. ఎందుకనగా రక్తానికి ప్రత్యామ్నాయం లేదని ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక వ్యక్తికి పునర్జన్మను ఇచ్చినట్లు అవుతుందన్నారు. రక్తదానం చేయడం వలన శరీరంలో కొత్త రక్తం ఉత్పత్తి అవుతుందని దీనివల్ల గుండె జబ్బుల ముప్పుతప్పుతుందన్నారు. 18 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల వరకు ఆరోగ్యంగా ఉన్న ఎవరైనా ప్రతి మూడు నెలలకు ఒకసారి సురక్షితంగా రక్త దానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైద్య బృందం డాక్టర్ బి.శ్వేతా డాక్టర్ స్వాతి డాక్టర్ విష్ణువర్ధన్ రక్తదాతలు తదితరులున్నారు.

# ఐక్యంగా ఉండి బలోపేతం అవ్వడానికి కృషి చేద్దాం

## కాపు జేఏసీ అధ్యక్షులు అమ్మ శ్రీనివాస్ నాయుడు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో లేక్యు హొటల్లో శనివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు అమ్మ శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కావలి పట్టణంలోని త్వరలో కార్యాలయం ఏర్పాటు చేస్తామని, జేఏసీ కులాల్లోని ఎవ్వరికీ కష్టం వచ్చినా వారికి అండగా ఉండి సమస్య పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. విద్య, ఉద్యోగం, వైద్యం తదితర అవసరాలను జేఏసీ అండగా ఉంటుందని తెలిపారు.

# ఘనంగా వైయిఎస్ క్యాలెండర్ల ఆవిష్కరణ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ యాదవ ఎంప్లాయీస్ సొసైటి రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం ఘనంగా ఆవిష్కరించారు. అతిధులుగా పాల్గొన్న స్థానిక డీఎస్పీ కె.వేణుగోపాల్, మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్, సిఐ జ.గంగాధర్, ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శివకేష్‌యాదవ్‌లు సొసైటి నాయకులతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కమీషనర్ గంగాప్రసాద్ మాట్లాడుతూ.. చదువుతోనే పేదరికంను సయించవచ్చని, అందరూ తమ బిడ్డలను బాగా చదివించేందుకు కృషిచేయాలని కోరారు. డిఎస్‌పి వేణుగోపాల్ మాట్లాడుతూ యాదవ ఉద్యోగులు ఐక్యంగా ఉంటూ సమాజాభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఆర్టీసీ డిఎం శివకేష్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి యాదవ ఉద్యోగి నిబద్ధతగా విధులు నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు. సిఐ గంగాధర్ మాట్లాడుతూ అన్ని ట్రెజరీలపరిధిలో అన్నివిభాగాల్లో పనిచేస్తున్న యాదవ ఉద్యోగులను ఒక్కత్రాటిపైకి తీసుకొచ్చిన యాదవ ఎంప్లాయీస్ సొసైటిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఇఎస్ ప్రతినిధులు యలగాల కొండలరావు, కాళ్ళ వెంకటేశ్వర్లు, నల్లమేకల చిన్నయ్య, డేగా సుబ్బారావు, ఈ.సుందరం, బి.రోశయ్య, టి.సురేష్‌బాబు, బి.మల్లికార్జున, ఎన్.భాస్కర్, ఎన్.చెన్నయ్య, ఓ.మల్లికార్జున, జి.రమణయ్య, జి.గంగయ్య, యలగాల కృష్ణయ్యలు పాల్గొన్నారు.



## జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చా కార్యదర్శిగా సుమంత్‌రెడ్డి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చా కార్యదర్శిగా ఆత్మకూరుకు చెందిన పంగులూరు సుమంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా బిజెపి అధ్యక్షుడు సీపారెడ్డి వంశీధర్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. పార్టీలో అత్యంత చురుగ్గా వ్యవహరిస్తూ పార్టీ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తున్న సుమంత్‌రెడ్డిని పార్టీ జిల్లా అధిష్టానం గుర్తించి కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శిగా నియమించారు. సుమంత్‌రెడ్డిని సీనియర్ బిజెపి నాయకుడు కుడుముల సుధాకర్‌రెడ్డి, నియోజకవర్గ బిజెపి ఇన్‌చార్జ్ కంది మల్లికార్జునరెడ్డి తదితరులు అభినందించారు. ఈసందర్భంగా సుమంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శిగా నియమించడం సంతోషదాయకమని, వారి నమ్మకాన్ని వమ్ముకానివ్వకుండా వ్యవహరిస్తానని, తన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని, పార్టీ పటిష్టతకు, బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం, రైతుల సమస్యలు పరిష్కారంకోసం చిత్తశుద్ధిగా అంకితభావంతో పట్టుదలగా శ్రద్ధతో కృషిచేస్తానని సుమంత్‌రెడ్డి పేర్కొన్నారు. తాను అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తానని, పార్టీని, కిసాన్‌మోర్చాను బలోపేతం చేసేందుకు, జిల్లా కమిటీ ఇచ్చే పిలుపుమేరకు కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తానని ఆయన వెల్లడించారు. తనను జిల్లా కిసాన్‌మోర్చా కార్యదర్శిగా నియమించిన జిల్లా బిజెపి అధ్యక్షుడు సీపా వంశీధర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలని సుమంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఆత్మకూరు అభివృద్ధి అంటేనే మంత్రి ఆనం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు అంటే ఆనం.. అభివృద్ధి అంటే ఆనం.. శాశ్వత ప్రగతి అంటే ఆనం.. విభిన్నవిద్యాసంస్థలు అన్నా, రెవిన్యూ డివిజన్, మున్సిపాలిటీ, జిల్లా ఆస్పత్రి అన్నా అందరూ ఠకీమని అందరూ చెప్పేపేరు ఆనం.. ఆయన నాడు, నేడూ ఆత్మకూరును అభివృద్ధి సాధించిన, సాధిస్తున్న నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖామంత్రి, నేటి రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి. ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధి విషయంలో గత 10సంవత్సరాలుగా పడకేసి ఉండగా ఏడాదిన్నర క్రితం ఎమ్మెల్యేగా ఎన్నికైన రాష్ట్ర దేవాదాయశాఖా మాత్యులు ఆనం రామనారాయణరెడ్డి అమిత వేగంగా ప్రగతిని పట్టాలెక్కించి పరుగులు తీయిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే సంక్షేమంతోపాటు అనూహ్యంగా సమాంతరంగా అభివృద్ధి సాధిస్తున్నారు. గతంలో రామనారాయణరెడ్డి ఆత్మకూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా వ్యవహరించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికశాఖామాత్యులుగా వ్యవహరించారు. అప్పట్లో ఆత్మకూరు నియోజకవర్గానికి దాదాపు 2500కోట్ల రూపాయల నిధులు సాధించి అనేక రహదారులు, వంతెనలు, భవనాలు నిర్మించడంతోపాటు ప్రాంతీయవైద్యశాలను, ప్రభుత్వ పాలిటెక్నిక్‌ను, రెవిన్యూ డివిజన్, మున్సిపాలిటీ, నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కస్తూర్బాపాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, ఐటిఐలు సాధించారు. ఆత్మకూరులో అభివృద్ధికి చిహ్నం ఆనం అనే నానుడి జనాల్లో బలంగా నాటుకుపోయింది. 2024 ఎన్నికల్లో ఆయన టిడిపి తరపున అభ్యర్థికాగానే వైసిపి బలంగా ఉన్న ఈ నియోజకవర్గంలో అభివృద్ధి ప్రదాత వచ్చారు. ఆయన ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తే ప్రగతి పరుగులు తీస్తుందని అందరూ విశ్వశించి అనూహ్యంగా అన్నివర్గాలు ఆయనకు బాసటగా నిలిచి విజయం కట్టబెట్టారు. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక సీనియర్‌గా, గతంలో అనేక మంత్రిత్వశాఖలు నిర్వహించిన నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గుర్తించి ఆయనకు దేవాదాయమంత్రిగా ఎంపికచేశారు. ఆయన పదవి చేపట్టి ఏడాదిన్నర కాగా తన రాజకీయ, పాలనానుభవంతో ముఖ్యమంత్రి సాన్నిహిత్యంతో, సహచరమంత్రుల సహకారంతో ఆత్మకూరు అభివృద్ధికి కంకణదారుడయ్యారు. టిడ్కో గృహాల్లో రామాలయాన్ని సాధించారు. పంచాయతీరాజ్ అతిధిగృహానికి 1.7కోట్ల రూపాయల నిధులు సాధించి శంఖుస్థాపన గావించగా పనులు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బి అతిధిగృహం నిర్మాణం నిలిచిపోయి ఉండగా నిధులు సాధించి పూర్తిచేయించి ప్రారంభింపజేశారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో తాగునీరు, రోడ్డు, డ్రైనేజిలకు దాదాపు 65కోట్ల రూపాయలు సాధించారు. నిలిచిపోయి ఉన్న సోమశిల హైలెవెల్‌కెనాల్ నిర్మాణాలు, సోమశిల ప్రాజెక్టు ఆప్రాన్‌పనులకు నిధులు అధికంగా సాధించి ప్రారంభింపజేశారు. నియోజకవర్గంలో సిమెంటురోడ్ల నిర్మాణానికి కోట్లాది రూపాయలను ఉపాధిహామీపథకం ద్వారా మంత్రి ఆనం సాధించగా ఇప్పటికే అనేక రోడ్ల నిర్మాణాలు పూర్తికాగా పలురోడ్లు నిర్మాణంలో ఉన్నాయి. చెరువులు, కాలువల అభివృద్ధికి దాదాపు 100కోట్ల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆత్మకూరులో ఆయన మంజూరు చేయించిన 100పడకల హాస్పిటల్ ఆయన ప్రతిపాదన,కృషితో జిల్లా వైద్యశాలగా అప్‌గ్రేడ్ కాగా అన్నీ వసతులు సమకూర్చలేదని ముఖ్యమంత్రి, వైద్యశాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్ళి 300పడకల హాస్పటల్‌గా అభివృద్ధి చేసేందుకు తీవ్రంగా కృషిచేస్తున్నారు. బైపాస్‌రోడ్డు విస్తరణ, డివైడర్లు, సెంట్రల్‌లైటింగ్, వాకింగ్‌ట్రాక్స్ ఏర్పాటుకు దాదాపు 7కోట్లరూపాయలు సాధించి పనులు జరుగుతుండగా మరో 2కోట్లు కూడా సాధిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడిన ఈ అతికొద్ది సమయంలోనే ముఖ్యమంత్రిని 2దపాలు ఆత్మకూరు నియోజకవర్గానికి రప్పించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతోపాటు పలు హామీలు పొందారు. ఐదారు మంది మంత్రులను ఆత్మకూరుకు రప్పించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును ఆత్మకూరుకు రప్పించి నారంపేటవద్ద పారిశ్రామికపార్కును ప్రారంభింపజేయడంతో అనేక పరిశ్ర మాలు ఇక్కడ ఏర్పాటుకు అవకాశం ఏర్పడడంతోపాటు ముఖ్యమంత్రి హామీ కూడా లభించింది. దాంతో పరిశ్రమలు రాగవలన్న విశ్వాసం, వేలాదిమంది నిరుద్యోగయువతకు ఉద్యోగావకాశాలు లబించగలవన్న నమ్మకం జనాల్లో బలంగా ఏర్పడింది. నడికుడి-శ్రీకాళహస్తి రైలుమార్గం నత్తనడకన ఉండగా మంత్రి ఆనం దృష్టిసారించారు. త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయగా ముఖ్యమంత్రి కూడా ఇటీవల ఆత్మకూరులో హామీ ఇచ్చారు. ఆత్మకూరు చెరువువద్ద సుందరీకరణకు, పట్టణం శివార్లలో బైపాస్‌రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయించి ప్రభుత్వం నుండి నిధులు సాధించే యత్నంలో మంత్రి రామనారాయణరెడ్డి ఉన్నారు. పట్టణ బైపాస్‌రోడ్డు విస్తరణకు ఆయన 6.5కోట్ల రూపాయలు నిధులు సాధించగా టెండర్ పూర్తయి పనులు ప్రారంభమయ్యాయి. దాదాపు 130 దేవాలయాల అభివృద్ధికి దాదాపు 7కోట్లు, 10 విద్యాసంస్థల అభివృద్ధికి 1.03కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించారు. గత 10సంవత్సరాలుగా ఆత్మకూరులో ఎలాంటి అభివృద్ధి లేకుండా ఉన్న విషయం తెల్సిందే కాగా గతంలో నారంపేట వద్ద ఒక పరిశ్రమ ఏర్పాటు అంటూ శిలాఫలకం వైసిపి ప్రభుత్వం వేసినా ఆ పరిశ్రమను అప్పటి ముఖ్యమంత్రి తమ స్వంత జిల్లా కడప జిల్లాకు తరలించుకోవడం తెల్పిందేకాగా రామనారాయణరెడ్డి నారంపేట పార్కును అభివృద్ధి చేయించి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించి పలు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని సాక్షాత్తు ముఖ్యమంత్రితోనే హామీ ఇప్పించారు. అభివృద్ధి ప్రధాతగా పేరు గాంచిన ఆనం రామనారాయణరెడ్డి ఈఏడాది కాలంలోనే చేస్తున్న కృషి, పట్టుదల, సంకల్పం, లక్ష్యం చూస్తుంటే ఆత్మకూరు అభివృద్ధిని గతంలో పరుగులు తీయించిన మంత్రి నేడు ప్రగతిని పట్టాలెక్కిస్తున్నారని, ఇక స్పీడందుకుంటుందని, అనూహ్యంగా ఆత్మకూరు అభివృద్ధి సాధ్యమవు తుందని సర్వత్రా భావిస్తున్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ, నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల, మర్రిపాడు మండలాలు జనాలు ఆశించినదానికన్నా మరింతగా అభివృద్ధి సాధ్యమని అందరూ ఎంతో విశ్వాసంగా ఉన్నారు. ఆయన పార్టీపరంగా సభ్యత్వ నమోదు, ఇతర పార్టీ కార్యకలాపాల్లో ప్రత్యేకంగా శ్రద్ధచూపుతూ రాష్ట్రంలోనే ద్వితియ స్థానం పొందారు. ఆయనకు దేవాదాయశాఖను ముఖ్యమంత్రి అప్పగించగా నిరంతరం పర్యటిస్తూ రాష్ట్ర అధికారులతో సమీక్షిస్తూ పలు సంస్కరణలు, నిర్ణయాలు తదితరాలతో ఆయన బాధ్యతలను 100శాతం నిర్వహించారన్న పరిస్థితి అటు ప్రభుత్వ అధినేత వద్ద రికార్డు అయిందని కూడా తెలుస్తోంది. ఏదేమైనా ఆత్మకూరు అభివృద్ధి అంటే ఆనంతో సాధ్యం అన్న నానుడి నిజం కాగలదని సర్వత్రా భావిస్తున్నారు.

**ఆత్మకూరుకు విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్‌కాలేజి మంజూరు**

రాష్ట్రదేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టుదల, ప్రత్యేక కృషితో ఆత్మకూరుకు విక్రమసింహపురి ఇంజనీరింగ్ కాలేజి మంజూరుకు రంగం సిద్ధమైంది. ఈమేరకు విద్యాశాఖామంత్రి నారాలోకేష్ ఆమోదం తెలిపారు. రానున్న విద్యాసంవత్సరం నుండే అడ్మిషన్లు జరుగుతాయని చెబుతున్నారు. మంత్రి ఆనం కృషితో ఈనియోజకవర్గానికి ప్రభుత్వ సాంకేతికవిద్యను అందించేలా విక్రమ సింహపురి ఇంజనీరింగ్‌కాలేజి మంజూరుకు హామీలభించడంపట్ల సర్వత్రా హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు. 2026-27విద్యాసంవత్సరానికే ఈకాలేజి లో ఇంజనీరింగ్ కళాశాలలో 300మంది విద్యార్థులతో బిటెక్‌కోర్సులు ఐదు విభాగాల్లో ప్రారంభానికి నారాలోకేష్ ఆమోదం తెలిపారు. ఎన్‌డిఏ ప్రభుత్వం తొలిఏడాదిలోనే ఎన్నికల సమయంలో, అనంతరం ముఖ్యమంత్రి హెూదాలో ఆత్మకూరుకు విచ్చేసినపుడు ఆనం రామనారాయణరెడ్డి విన్నపం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చిన మేరకు విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కాలేజిని మంజూరు చేశారు. తాత్కాలికంగా ఈ కాలేజిని నెల్లూరులోని విఆర్‌ఏపిఎస్ కాలేజి భవనాల్లో తరగతులు నిర్వహిస్తారని, రెండేళ్ళలోపు ఆత్మకూరులో నూతన భవనాలు నిర్మించిన అనంతరం ఇక్కడ తరగతులు నిర్వహిస్థారని మంత్రి ఆనం పేర్కొన్నారు. విద్యారంగంలో మంత్రి ఆనం చొరవకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆత్మకూరు యువతకు తమ సొంత నియోజకవర్గంలోనే గుణాత్మకసాంకేతిక విద్య అందించేందుకు మార్గం ఏర్పడింది. ఆనం ముందస్తు దృష్టితో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన బాట ఏర్పాటుకానుంది. పేద, గ్రామీణ యువత ఇంజనీరింగ్ విద్యను అందుకునే అవకాశం ఏర్పడింది. యువత ఉజ్వల భవిష్యత్తు లక్ష్యంగా విద్యారంగంలో అంకితభావంతో మంత్రి ఆనం అడుగులు వేస్తున్నారు. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు తదుపరి తరాలకు ఆదర్శంగా నిలవనున్నాయి.ఆత్మకూరునుండే టెక్నాలజి మార్గంలో ఎంతోమంది యువత ముందుకు సాగేరోజు దరిచేరింది.

**నాడు 11విద్యాసంస్థలు సాధించిన మంత్రి ఆనం**

ఆత్మకూరు నియోజకవర్గంలో 2009లో ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఎన్నికై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖామంత్రిగా కొనసాగారు. ఆసమయంలో రామనారాయణరెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలో దాదాపు 2000కోట్లరూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి అభివృద్ధిప్రదాతగా పేరుగాంచారు. అప్పట్లో ఆత్మకూరు రెవిన్యూ డివిజన్, మున్సిపాలిటీ, ప్రాంతీయవైద్యశాల, మార్కెట్లు, అనేక కార్యాలయాల భవనాలు, పెన్నానదిపై అతిపెద్ద వంతెన, అనేక రోడ్లు, భవనాలు, వంతెనలు, సాగు, త్రాగునీటి పథకాలు సాధించారు. దాంతోపాటు ఆయన విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఈనియోజకవర్గానికి 11 ప్రత్యేక విద్యాసంస్థలను సాధించారు. నియోజకవర్గ కేంద్రానికేకాకుండా మండలాలకు కూడా ఆయన ప్రత్యేక విద్యాసంస్థలు సాధించారు. ఆత్మకూరు పట్టణానికి ఒక ప్రభుత్వ పాలిటెక్నిక్, ఒక ఎస్‌సి బాలికల గురుకుల పాఠశాలను సాధించగా ఈఏడాది ఒక బిసి గురుకులపాఠశాలను సాధించి దాన్ని కాలేజిగా కూడా అప్‌గ్రేడ్ చేయించారు. గతంలో ఈనియోజకవర్గంలోని ఏఎస్‌పే మండలానికి ఒక ఐటిఐ(హసనాపురం), ఒక మోడల్ హైస్కూల్,కాలేజి, ఒక కస్తూర్బాగాంధీబాలికల గురుకుల పాఠశాలను మంజూరు చేయించారు. మర్రిపాడు మండలానికి ఒక మోడల్‌హైస్కూల్, కాలేజి, నందవరంకు ఒక కస్తూర్బాస్కూల్‌ను మంజూరు చేయించారు. చేజర్లమండలానికి ఒక గురుకులబాలికల పాఠశాల (ఆదూరుపల్లి)ని మంజూరు చేయించారు. అనంతసాగరం మండలానికి ఒక వ్యవసాయ పాలిటెక్నిక్‌కాలేజి (సోమశిల)ను మంజూరు చేయించారు. సంగం మండలానికి ఒక ఐటిఐ మంజూరు చేయించారు. ఈ ఐటిఐకు భవనాలు లేకపోగా ఆనం రామనారాయణరెడ్డి మళ్ళీ ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఎన్నికై రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రిగా వ్యవహరిస్తుండగా ల్యాంకో గ్రూప్స్ చైర్మెన్ లగడపాటి రాజగోపాల్‌లో చర్చించి ఆయన సంగంలో నిర్మించిన పక్కాభవనాలను ఐటిఐకి ఇచ్చేలా ఒప్పించి ప్రభుత్వం వద్ద ఈ ఐటిఐ పేరు లగడపాటి వెంకట్రామానాయుడు ఐటిఐగా నామకరణం చేసేలా ప్రభుత్వం నుండి జవో కూడా తెప్పించిన రామనారాయణరెడ్డి ఆభవనాల్లో ఐటిఐ ప్రారంబించేందుకు నిర్ణయించారు. అన్నిరంగాలకు ప్రాధాన్యత ఇస్తూనే అభివృద్ధి సాధిస్తూనే విద్యకు ఆయన అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అనేక ప్రత్యేక విద్యాసంస్థలను సాధించడం విశేషం. ఈపరిణామాలతో జనాలు ఆయనకు జేజేలు పలుకుతున్నారు.

# కావలిలో 'మెడికవర్' కార్పొరేట్ వైద్యసేవలు

## నెలలో 15 రోజుల పాటు స్పెషలిస్ట్ వైద్యులు కావలికి రాక



**కావాలి, మేజర్‌న్యూస్ :** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేయడమే లక్ష్యంగా నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కావలిలో తమ సేవలను విస్తరించిందని నెలలో 15 రోజుల పాటు స్పెషలిస్ట్ వైద్యులు కావలికి వచ్చి వైద్యసేవలు అందించనున్నట్లు మెడికవర్ హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ జి.రంజిత్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్ నందు డాక్టర్ కౌశిక్ రెడ్డి (పర్మనాలజిస్ట్), డాక్టర్ జయరాం (కార్డియాలజిస్ట్)లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. నెల్లూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లకుండానే పట్టణ, గ్రామీణ ప్రాంత రోగులకు వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. నిపుణులైన సూపర్ స్పెషాలిటీ వైద్యులచే ప్రతి నెలలో సోమవారం, గురువారం శనివారాలలో కావలిలోని ఉమాచంద్ హాస్పిటల్, రవికాంత్ హాస్పిటల్, భాను ప్రకాష్ హాస్పటల్, అల్తాన్ హాస్పటల్, చంద్రశేఖర్ క్లినిక్‌లలో వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. కావలిత్తోపాటు కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు తదితర ప్రాంతాల ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. స్థానికంగా ప్రాథమిక, మెరుగైన చికిత్సలు అందిస్తూనే, ఒకవేళ అత్యవసర పరిస్థితి ఏర్పడితే అన్ని వసతులతో కూడిన నెల్లూరు మెడికవర్ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తామని భరోసా ఇచ్చారు. తక్కువ ఖర్చుతో కూడిన ఈ కార్పొరేట్ వైద్యాన్ని ప్రజలు వినియోగించుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నారాయణలో ఘనంగా రైతు దినోత్సవం వేడుకలు




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని బాలాజీ నగర్ నారాయణ స్కూల్ బ్రాంచ్‌లో శనివారం ఫార్మర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు పల్లెటూరి వాతావరణం ప్రతిబింబించేలాపల్లె జీవన సౌందర్యాన్ని చూపించేల చిన్నారులు రైతు వేషధారణలో, కూలి వేషధారణలో, పంటలు, కురగాయలతో చేత పట్టుకొని అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వందన వైస్ ప్రిన్సిపాల్ అనూష రెడ్డి మాట్లాడుతూ.. రైతు కష్టం లేకపోతే మన భోజనం ఉండదన్నారు. రైతు పొలంలో విత్తనం వేస్తేనే మన ఇల్లు గడుస్తుందన్నారు.వ్యవసాయం కేవలం వృత్తి కాదనీ అది మన సంస్కృతనీ వివరించారు రైతు మనుగడే మన జీవనాధారం అని పేర్కొన్నారు.పిల్లలకు రైతు గౌరవం, ధాన్యం విలువ, ఆహార ధాన్యాన్ని వృథా చేయకూడదనేది ప్రేమగా వివరించారు.చిన్నారులు ఆసక్తిగా విని, చప్పట్లతో స్పందించి, రైతన్నకు సెల్యూట్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని మరింత అందంగా మార్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


# స్వామిత్ర సర్వేను పక్కాగా చేపట్టాలి

## జలదంకి ఉప సర్పంచ్ కూరపాటి మాలకొండ రెడ్డి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వామిత్ర సర్వేను అధికారులు పక్కాగా, ఎలాంటి అవినీతికి చోటు లేకుండా చేపట్టాలని జలదంకి పంచాయితీ ఉప సర్పంచ్ కూరపాటి మాలకొండరెడ్డి పేర్కొన్నారు. శనివారం పంచాయతీ కార్యాలయం సమీపంలో స్వామిత్ర సర్వేపై జలదంకి పంచాయతీ కార్యదర్శులతో స్వామిత్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కూరపాటి మాలకొండరెడ్డి మాట్లాడుతూ.. మండల కేంద్రమైన జలదంకిలో స్వామిత్ర సర్వేను కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సామిత్ర సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో గ్రామాల్లోని అన్ని రకాల ఆస్తులను సర్వే చేయాలని సూచించారు. స్వామిత్ర పథకం ఉద్దేశం గ్రామీణ ప్రాంతాల సైతం సమగ్ర నివాస, ఆస్తి యాజమాన్యాల పరిష్కారాన్ని అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గ్రామాల్లో అన్ని ఆస్తులకు కొత్త యాజమాన్య హక్కులు వస్తాయని ఆయన అన్నారు. ఈ స్వామిత్ర పథకం ద్వారా అసలైన వారసులకు, అసలైన ఆస్తుల యజమానులకు లబ్ధి చేకూరుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎం.వెంకటకృష్ణ, డి.మౌనిక, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కమిటీ నియామకం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయం నందు భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా కమిటీని జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి సూచనల మేరకు కిసాన్ మోర్చా నెల్లూరు జిల్లా అధ్యక్షులు తిరకాల మోహన్‌బాబు అధ్యక్షతన కిసాన్ మోర్చా జిల్లా పదాది కారుల నియామకం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. కిసాన్ మోర్చా నూతన కార్యవర్గానికి దిశానిర్దేశం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కిసాన్ మోర్చా నెల్లూరు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటైన కమిటీ సభ్యులు రైతుల సమస్యలపై, ప్రయోజనాల కోసం అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు సన్నిగంటి శ్రీనివాసులు, రాష్ట్ర బీజేపీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వేమారెడ్డి సురేంద్రనాథ్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చేవూరి వినయ్ నారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం విజయ్ కుమార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫణిరాజు, బీజేపీ కిసాన్ మోర్చా నూతన కార్యవర్గం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ఏపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆర్డీఓ పావని



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపిటిఎఫ్) రూపొందించిన 2026నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం ఆత్మకూరు ఆర్డీవో భూమిరెడ్డి పావని ఆవిష్కరించారు. ఆత్మకూరు డివిజన్ ఏపిటిఎఫ్ వారు ఉపాధ్యాయులకు, పాఠశాలలకు, ప్రజలకు ఉపయోగపడే విధంగా వాల్‌క్యాలెండర్లు, స్టిక్కర్‌క్యాలెండర్లు, మధ్యాహ్న భోజన మెనూ, సిఎల్‌బుక్, పాకెట్‌బుక్‌ను రూపొందించగా వాటిని ఆర్డీవో పావని, ఫెడరేషన్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆర్డీవో పావని మాట్లాడుతూ.. నూతన సంవత్సరానికి సంబంధించి వివిద వివరాలతోకూడిన క్యాలెండర్లను రూపొందించడం అభినందనీయమని, 2026లో విద్యాపరంగా మంచిఫలితాలు సాధించాలని, పి4పథకంద్వారా పాఠశాలల అభివృద్ధికి ప్రయత్నం చేద్దామని, అవసరమైన పాఠశాలల వివరాలను తెలియజేయాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ ఆర్.వెంకటేశ్వర్లురెడ్డి, జిల్లా కమిటీ బాధ్యులు వెంగయ్య, రామసుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి, శివకుమార్, మండల ప్రధానకార్యదర్శి శివరామిరెడ్డి, గౌరవాధ్యక్షుడు బండారు వెంకటేశ్వర్లు, తిరుపతిరెడ్డి, లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అయ్యన్న, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన డాక్టర్ చిల్లూరు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో శనివారం ఏపియాదవ్ ఎంప్లాయీస్ సొసైటి రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా వైకాపా ఉపాధ్యక్షుడు, స్థానిక చిన్నపిల్లల వైద్యనిపుణులు, మాజీ జెడ్పిటిసి మెంబర్ డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్‌లో అన్ని వివరాలను పొందుపరిచి ప్రజలకు అందజేయడం సంతోషదాయకమని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సొసైటి సభ్యులు, డాక్టర్ చిల్లూరు ఆత్మీయులు యలగాల కొండలరావు, కాళ్ళ వెంకటేశ్వర్లు, నల్లమేకల చిన్నయ్య, డేగా సుబ్బారావు, ఈ.సుందరం, బత్తల రోశయ్య, టి.సురేష్‌బాబు, బొబ్బల మల్లికార్జున, ఎన్.భాస్కర్, ఎన్.చిన్నయ్య, ఒంటేరు మల్లికార్జున, జి.రమణయ్య, జి.గంగయ్య, యలగాల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సంస్థల మధ్య చారిత్రాత్మక ఒప్పందం




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం విద్యార్థులకు అంతర్జాతీయ అవకాశాలు కల్పించే దిశగా ఏపీయుఎన్ఏ, ఐజిఓలకు అనుబంధమైన యుఎన్ఏ గ్రూప్ ఇంటిటీస్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో ఎస్‌డిజిఎస్ మానవ హక్కులు, పర్యావరణ పరిరక్షణ, అంతర్జాతీయ సంబంధాలపై వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, ఇంటర్న్‌షిప్‌లు నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో గ్లోబల్ అవగాహన, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు తెలిపారు. అంతర్జాతీయ సెమినార్‌లు, శిక్షణల ద్వారా విద్యార్థులు ప్రపంచస్థాయిలో రాణిస్తారని యూఎన్ విజన్ డిప్లొమాట్ జయరాములు లింగుట్ల పేర్కొన్నారు. ఈ ఒప్పందం వర్సిటీ అకడమిక్ ప్రతిష్టను మరింత పెంచుతుందని రిజిస్ట్రార్ డా. కె.సునీత అన్నారు.

# ప్రజా ఆరోగ్య చైతన్యంలో పీఎంపీల కృషి అభినందనయం

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ వి.సుజాత



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ప్రజా ఆరోగ్య చైతన్యంలో పీఎంపీలు చేస్తున్నటువంటి కృషి అభినందనీయమని డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వి.సుజాత తెలియజేశారు. అదేవిధంగా శనివారం నాడు స్థానిక ఏనుగు సుందర రామిరెడ్డి కళ్యాణమండపం నందు జరిగిన 63వ పీఎంపీ వ్యవస్థాపక దినోత్సవంలో జ్యోతి ప్రజ్వన చేసి, ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ వి.సుజాత మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య అవసరాలకు ప్రాథమిక వైద్య సేవలే కాకుండా గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలతో మమేకమై ఎన్నో అంతు చిక్కని వ్యాధులను, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను వారికి వివరించి



వారిలో అవగాహన పెంపొందించేందుకు పీఎంపీలు కృషి అభినందనీయమన్నారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణలో పీఎంపీలకు తమ సహాయ, సహకారం ఉంటుందన్నారు. అనంతరం జిల్లా లెప్రసీ నివారణాధికారి డాక్టర్ షేక్ ఖాదర్ వలీ మాట్లాడుతూ.. అనేక రకాల అంటూ వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల నుండి ప్రజలను చైతన్యవంతులు చేసే దానికి డాక్టర్ ఖాదరవల్లి తన పాటల ద్వారా అవగాహన కల్పించారు. అలాగే మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి మాట్లాడుతూ.. పిఎంపిలతో ఎన్నో ఆరోగ్య కార్యక్రమాలు విజయవంతంగా చేపట్టినట్లు తెలియజేశారు. ప్రభుత్వ కంటి వైద్య నిపుణులు డాక్టర్ బి.శార్వాణి మాట్లాడుతూ.. మానవుని శరీరంలో అతి ముఖ్యమైన భాగం కన్ను అని, నేత్రదానం ఎప్పుడు చేయాలి? ఎలా చేయాలి అనే దానిమీద అవగాహన కలిగించారు. అవయదానంలో కీలకమైన కిడ్నీ దానంపై డాక్టర్ సురేంద్రకుమార్ వీడియో ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా విచ్చేసిన నారాయణ హాస్పిటల్ ఏజిఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. 25 సంవత్సరాలుగా పీఎంపీ వ్యవస్థాపక దినోత్సవంలో క్రమం తప్పకుండా పాల్గొనడం సంతోష దాయకం అన్నారు. ప్రతి సంవత్సరం ఒక్కో ఆరోగ్య అవగాహనతో పీఎంపీ డే జరుపుకోవడం జరుగుతుందని, ఈ సంవత్సరం అవయవదానంపై అవగాహన కార్యక్రమం చేపట్టడం పీఎంపీలకు కృషికి నిదర్శనం అన్నారు. మెదడు నరాల వ్యాధులపై డాక్టర్ ఎ.వైష్ణవి, కీళ్లు, ఎముకలు వ్యాధులపై డాక్టర్ కే.భాస్కర్, జనరల్, లాప్రోస్కోపీ సర్జన్‌పై డాక్టర్ పి. అమర్నాథరెడ్డి, చిన్నపిల్లల వ్యాధులపై డాక్టర్ బి.రాజశేఖర్‌రెడ్డి ఊపిరితిత్తులు వ్యాధులపై డాక్టర్ సి.ప్రేమ్ దీప్, చర్మవ్యాధులపై డాక్టర్ ఎస్.శ్వేత, స్త్రీ, గర్భకోశ వ్యాధులపై డాక్టర్ వి.విజయలక్ష్మి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభ్యులకు అవగాహన కలిగించారు.

**నారాయణ మెడికల్ గ్రూప్ ఏజీఎం చౌకచర్ల భాస్కర్ రెడ్డికి పిఎంపీల ఆత్మీయ సత్కారం**

పీఎంపీలతో గత 25 సంవత్సరాలుగా మమేకమై వారి వృత్తి పరిరక్షణ కొరకు, వైద్య విజ్ఞానం పొందించే తరగతులు నిర్వహించడం, ఎన్నో వేల ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు, ఏర్పాటు చేయడం ద్వారా పీఎంపీల ఆత్మీయ బంధువుగా భాస్కర్‌రెడ్డి కృషికి ముఖ్యఅతిథుల సారాధ్యంలో పీఎంపీలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పిఎంపి గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, న్యాయ సలహాదారు పి.రమాదేవి, శాఖవరపు వేణు గోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ఎన్.ప్రసాద్, యు.రాందాస్, ఎన్.మాలిని, పివి. రమణయ్య, ఓ.మస్తానయ్య, కే.వెంకటేశ్వర్లు, యు.శేఖర్, సి.సాయి మురళి జిల్లాలోని 300 మంది పిఎంపి సభ్యులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు నిరంతరం పర్యవేక్షణ : ఇన్‌చార్జ్ మేయర్




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విభాగం అధికారుల సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ హెల్త్, మున్సిపల్ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రభాకర్ రావు, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ ఆలోచనల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు అత్యాధునిక సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించనున్నారని తెలిపారు. 'ఇన్ సర్కిల్' వెబ్‌సైట్ ద్వారా నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో జరిగే అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించే విధంగా ఆ వెబ్సైట్ ద్వారా మానిటరింగ్ వ్యవస్థను అభివృద్ధి చేశారని తెలిపారు. అభివృద్ధి పనులలో జాప్యం జరగకుండా, నిర్దేశించిన సమయానికి పూర్తి అయ్యేలా, నాణ్యమైన నిర్మాణ పనులను చేపట్టేలా, నగరవ్యాప్తంగా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం వంటి తదితర అంశాలను మంత్రి ఏ ప్రాంతం నుంచైనా నిరంతరం పర్యవేక్షించేందుకు రూపొందించిన ఆ వెబ్సైట్ ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఇన్‌చార్జ్ మేయర్ వివరించారు. నెల్లూరు నగరపాలక సంస్థతోపాటు రాష్ట్రంలోని ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు సంబంధించిన అభివృద్ధి పనుల వివరాలను ఎప్పటికప్పు డు ఆ వెబ్సైట్ ద్వారా మంత్రి పర్యవేక్షిస్తూ ఉంటారని, అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు మంత్రి వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం అంద రికీ ఆదర్శనీయమని ఇన్‌చార్జ్ మేయర్ ప్రశంసించారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ గిరిధర్, నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్‌రావు, ఈఈలు రహంతు జానీ, అనిల్ కుమార్, డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# గొల్లబోయి అవతారంలో రంగడు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రంగనాయకులపేటలో వెలసియున్న శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానం నందు శనివారం పగల్ పత్తు ఉత్సవాలలో భాగంగా సాయంత్రం గొల్లబోయి అవతారంలో శ్రీ శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ రంగనాథ స్వామి వారు కనివిందు చేయడం జరిగింది. ఈ ఉత్సవాలు తిలకించడానికి భక్తులు అధికంగా తరలి వచ్చారు. ఈ కార్యక్రమంకు ఉభయదాత దేవిశెట్టి వెంకట సుబ్బయ్య శెట్టి వ్యవహరించారు. ఈ కార్యక్రమంకు ఆలయ ఈఓ శ్రీ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి, దేవస్థాన సిబ్బంది కార్యక్రమం నందు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థి ప్రతిభ




**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్,మై భారత్ నెల్లూరు ఆధ్వర్యంలో మేరా యువభారత్ కార్యక్రమంలో భాగంగా డిస్ట్రిక్ట్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ శనివారం నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగాయి. ఈ గేమ్స్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని బి ఝాన్సీ రాణి (జూనియర్ ఎంపీసీ) పరుగు పందెంలో రెండవ బహుమతి కైవసం చేసుకొని జిల్లా యువజన అధికారి మహేంద్ర చేతులమీదుగా బహుమతిని అందుకున్నారు. జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ను అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కే.లక్ష్మీనారాయణ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది ఝాన్సీ రాణికి అభినందనలు తెలిపారు.

# అయ్యప్ప మండల పూజలు మహాదీపారాధన



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు వేదాయపాలెంలోని అయ్యప్ప స్వామి దేవ స్థానంలో కేరళ సాంప్రదాయ మండల పూజలు శనివారం ఆలయ ప్రాంగణం అత్యంత వైభవంగా అలంకరించి కేరళ సాంప్రదాయ అర్చక తంత్రులు పూజలు నిర్వహించారు. తొలుత అయ్యప్ప స్వామికి నిర్మాల్య దర్శనం, పాలాభి షేకం, మహాగణపతి హోమం, దేవాలయ ప్రాంగణమంతా వివిధ సుగంధ పుష్పాలం కరణతో స్వామి వారికి ఉషపూజ, శ్రీ వేలి ఉత్సవం, కలశ పూజ, మహా కలబ కుంభ పూజ, నవకాభిషేకం, కలబాభిషేకం చందనాలంకార దర్శనం, ఉచ్చ పూజ, మహా పుష్పభిషేకం, శ్రీ వేలి ఉత్సవం, సాయంత్రం పూలంగి సేవ దర్శనం, మహాదీపారాధన, భగవతి సేవ, శ్రీవేలి ఉత్సవం, పడి కర్పూర దీపం, హరిహరాసనం సేవ జరిగాయి. శ్రీ స్వామి అయ్యప్పస్వామి మండల పూజల చివరి మూడు రోజులు అయ్యప్పకు కలబాభిషేకం, కేరళ తంత్రులు నిర్వహించి తదుపరి భక్తులకు అయ్యప్ప స్వామి చందనాలంకార దర్శనం చేశారు. ఈ సందర్భంగా భగవతి సేవలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల పూజలకు అన్నదానంకు గూడల శేషగిరిరావు చంచల దేవి దంపతులు, కిరణ్ కుమార్ సునీల దంపతులు, ఆనంద్ మాధురి దంపతులు, చిరంజీవి రేణుక దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరిం చారు. ఈ కార్యక్రమాలు అధ్యక్షులు గూడల శేషగిరిరావు కార్యదర్శి కత్తుల వెంకటరత్నం పర్యవేక్షణలో జరిగాయి. కమిటీ సభ్యులు పలువురు అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.